నూజివీడులో సైకిల్ ఎక్కేదెవరు ?

- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ముద్దరబోయిన
- తెరపైకి వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథి పేరు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ జిల్లా రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఏ క్షణాన ఎవరిని ఏ సీటు వరిస్తుందోననే ఉత్కంఠ నెలకొంది. లుకలుకలు, అలకల మధ్య నలిగిపోతున్న వైసీపీ నుంచి నాయకులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. వారంతా టీడీపీ-జనసేన కూటమి వైపు చూస్తుండడంతో ఇక్కడ పోటీ పెరుగుతోంది. దాదాపు అధికారం ఖాయమని అంతా భావిస్తున్న తరుణంలో నూజివీడు నియోజకవర్గంపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. టీడీపీ ఇన్‌చార్జ్‌గా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వ్యవహరిస్తుండగా.. తాజాగా వైసీపీకి చెందిన ఉమ్మడి కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి టీడీపీలోకి వచ్చి ఇక్కడి నుంచి పోటీ చేస్తారనే సంకేతాలు చర్చనీయాంశంగా మారాయి. నూజివీడు నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వున్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా వున్న తెలుగుదేశం పార్టీ ఈసారి ఎలాగైనా ఆ స్థానాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. అక్కడ పార్టీ పటిష్ఠతపై దృష్టి సారించింది. స్థానిక సమస్యలు, వర్గ విభేదాలపై అక్కడి నాయకులను లోకేశ్ 'యువగళం' పాదయాత్ర సందర్భంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు పలు సూచనలు చేశారు.

సైకిల్ ఎక్కేందుకు పార్థసారథి

ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మాజీ మంత్రి, పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆ స్థానంపై ఆసక్తి చూపుతుండడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ తరపున మంత్రి వర్గంలో స్థానం దక్కక పోవడం, పార్టీలోనూ సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో పార్టీ పెద్దలపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఇక వైసీపీ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో టీడీపీ నుంచి పెనమలూరు సీటు ఆశించారు. కానీ, ఆయనకు నూజివీడు లేదా మరోచోట మాత్రమే అవకాశం ఉంటుందనే సంకేతాలు టీడీపీ పెద్దలు అందించారు. చివరకు నూజివీడు నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రిగా పనిచేసిన సమయంలో నూజివీడుతో సత్సంబంధాలు కొనసాగించిన ఆయన సొంత సామాజిక వర్గం బలంగా ఉందని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఇప్పటికే నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ చేసిన ముద్దరబోయిన మూడోసారీ ఆ సీటుపై ఆసక్తి కనబరుస్తున్నారు. పూర్తిస్థాయిలో పార్టీపై తనకు నమ్మకం ఉందని చెబుతున్నారు. తాజా పరిణామాల్లో సారథి పేరు వినిపిస్తోన్న క్రమంలో స్థానిక రాజకీయంలో కొంత మార్పు కనిపిస్తోంది. సారథి, ముద్దరబోయిన ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులు కావడంతో ఆ వర్గం నుంచి సానుకూల పవనాలు వీస్తున్నాయి. ముద్దరబోయినకు పరిస్థితులు వివరించి సారథికి టిక్కెట్ ఇస్తారని పార్టీ పెద్దలు చెబుతున్నారు. మరోవైపు నాలుగున్నరేళ్లలో పర్వతనేని గంగాధర్ కూడా టీడీపీ టికెట్ ప్రయత్నాలు సాగించారు. పార్టీ తరపున పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలుమార్లు అధినేతను కలిసిన మనస్సులో మాట చెప్పారు. ఎన్నికలకు చాలా సమయం ఉండడంతో చంద్రబాబు నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. తాజాగా గంగాధర్ పేరును స్థానికంగా పలువురు నాయకులు ప్రస్తావిస్తున్నారు. అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్ఠానం స్థానిక నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

సీఎంపై కేసు నమోదు చేయండి

- కైకలూరు, లక్కవరంలో పోలీసులకు టీడీపీ నాయకుల ఫిర్యాదు



కైకలూరులో పోలీసుస్టేషన్ వద్ద సీఐ రఘుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు



లక్కవరం పోలీస్‌స్టేషన్‌లో ...

కైకలూరు/జంగారెడ్డిగూడెం, జనవరి 10: జగన్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను ఇవ్వకుండా మోసం చేసిందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు అన్నారు. బుధవారం తెలుగుయువత ఆధ్వర్యంలో కైకలూరు టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి మోసం చేశారని కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ ఆకుల రఘుకు ఫిర్యాదు చేశారు. మాట ఇచ్చి మోసం చేసినందుకు సీఎంపై కేసు నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగం 6.5 శాతం పెరిగిందని, వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లుగా తన సొంత పత్రికల్లో కోట్లాది రూపాయల ప్రకటనలు ఇచ్చి ప్రజాధనాన్ని దోపిడీ చేస్తోందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం పోలీస్ స్టేషన్‌లో టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు గోలి అనిల్ ఆధ్వర్యంలో సీఎంపై ఫిర్యాదు చేశారు. తెలుగు యువత ముప్పిడి వేణు, చిలింతరాజుల మురళీ, జుజ్జవరపు వెంకట్, వీరబాబు, యుగంధర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు కనువిందు..

విదేశీ పక్షుల సందడి





చెట్ల కొమ్మలపై చేరిన కొల్లేటి కొంగలు



బోటులో ప్రయాణిస్తూ పక్షులను తిలకిస్తున్న పర్యాటకులు

కొల్లేటి సరస్సులో కొంగలు కనువిందు చేస్తున్నాయి. ఖండాంతరాలు దాటి కొల్లేటి తీరానికి వందలాది రకాల పక్షులు వేలాదిగా తరలివచ్చాయి. విహంగాల కిలకిలరావాలు.. ఎన్నో రకాల చేపలు, పచ్చని మొక్కలు.. సరస్సులో అరవిరిసిన కలువల అందాలు..



పక్షుల సంతానోత్పత్తి కోసం అటవీ శాఖ ఏర్పాటు చేసిన స్టాండ్స్‌పై గూళ్లు పెట్టుకున్న పక్షులు



పర్యావరణ ప్రేమికులను రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద మంచినీటి సరస్సు కొల్లేరు. స్వదేశీ, విదేశీ పక్షుల విడిది కేంద్రం. ఇక్కడ 185 రకాల పక్షులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో అత్యధికంగా వలస పక్షులుగా పేరొందిన పెలికాన్, పెయింటెడ్ స్టాక్ ప్రాముఖ్యత సంతరించు కున్నాయి. సైబీరియా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణిస్తూ కొల్లేరు సరస్సుకు చేరుతాయి. ఈ పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. బోటులో ప్రయాణిస్తూ వాటిని అత్యంత దగ్గరగా తిలకిస్తూ పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఈ సంవత్సరం పెలికాన్, పెయింటెడ్ స్టాక్, తెల్ల కంకణాలు, నల్లకంకణాల పిట్టలు, జమ్ముకోడి, గ్రేహెరాయిన్ (నారాయణపక్షి) పరద పిట్టలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో పర్యాటకులు పెద్దఎత్తున కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రాన్ని సందర్శిస్తున్నారు. కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తున్నారు.

- కైకలూరు

18లోగా విధుల్లో చేరకుంటే..



లింగపాలెంలో అంగన్‌వాడీ భవనానికి నోటీసు అంటిస్తున్న అధికారులు

- క్రమశిక్షణా చర్యలంటూ.. అంగన్వాడీలకు నోటీసులు
- తీసుకోకపోవడంతో ఇళ్లకు అంటించిన అధికారులు

ఏలూరు కలెక్టరేట్/భీమడోలు/ ఉంగుటూరు/చాట్రాయి/ లింగపాలెం : అంగన్‌వాడీలపై ప్రభుత్వం చర్యలకు దిగింది. ఈ నెల 18వ తేదీలోగా విధుల్లో చేరకుంటే ఎందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదు ? అంటూ నోటీసులో పేర్కొంది. అయితే జిల్లాలో అంగన్‌వాడీలు ఎక్కడా నోటీసులు అందుకోకపోవడంతో వారి ఇళ్ల గోడలపై వాటిని అధికారులు అంటిస్తున్నారు. భీమడోలు మండలంలోని వర్కర్లు, ఆయాలు ఈ నెల 18వ తేదీలోపు విధుల్లోకి చేరాలంటూ బుధవారం అధికారులు నోటీసులు ఇచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లు ఎవరూ నోటీసులు తీసుకోకపోవడంతో వారి ఇళ్ల గోడలకు అంటించి వెళ్లారు. మండలంలో 64 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 64 మంది ఆయాలకు నోటీసులు అందజేశారు. ఉంగుటూరులో అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. అంగన్వాడీ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, శారద, శ్రీలక్ష్మిలు వీఆర్వోలు, మహిళా పోలీసులతో వచ్చి నోటీసులు తీసుకోవాలని కోరగా అంగన్‌వాడీలు తిరస్కరించారు. చేసేది లేక అంగన్‌వాడీ సెంటర్ల వద్దకు వెళ్లి నోటీసులు అంటించారు. అంగన్‌వాడీ వర్కర్ల, ఆయాల ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. మొత్తం 85 మంది వర్కర్లు, 85 మంది ఆయాలకు నోటీసులు జారీ చేశారు. చాట్రాయి మండలంలో అన్ని గ్రామాల్లో అంగన్వాడీల ఇళ్లకు వెళ్లి షోకాజ్ నోటీసులు ఇవ్వబోగా వారు తీసుకునేందుకు వారు నిరాకరించటంతో ఇళ్ళ గోడలకు అంటించారు. చాట్రాయిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి, సచివాలయ మహిళా కార్యదర్శి చంద్రకళ, వీఆర్వో మురుగన్ నోటీసులను అంగన్వాడీల గోడలకు అంటించారు. లింగపాలెం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు, అంగన్‌వాడీల ఇళ్లకు నోటీసులు అంటించారు.



పోలసానపల్లిలో అంగన్‌వాడీ ఇంటికి అంటించిన నోటీసు



చాట్రాయిలో అంగన్వాడీల ఇళ్ల గోడలకు నోటీసులు అంటిస్తున్న అధికారులు

సీఎంకు ఆకలి విలువ తెలియదు

- మాజీ ఎమ్మెల్యే గఫూర్



జగన్ వంటి మూర్ఖ ప్రభుత్వంపై ఐక్యతతో, పట్టుదలతో పోరాటమే శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ గఫూర్ అన్నారు. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సమ్మె 30వ రోజుకు చేరుకుంది. 24 గంటల దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే గఫూర్ బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీల ఉద్యమం ఆకలి ఉద్యమమని, జగన్‌కు ఆకలి విలువ తెలియదని, అందుకే దుర్మార్గమైన చట్టాలను ప్రయోగించి ఆయన మాత్రం ప్యాలెస్‌లో కులాసాగా ఉంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి నీరో చక్రవర్తికి ఐక్యతతో కార్మిక సంఘాలు ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పట్టుదలగా ఉద్యమించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, కె.విజయలక్ష్మి, వై.రాంబాబు, ఈ.సాయిబాబు, జె.గోపి, యూటీఎఫ్ నాయకులు పి.వి నరసింహారావు, కనకదుర్గ, పి.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 10 : జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికలను నిష్పక్షపాతంగా, తటస్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. విజయవాడలో సీఈసీ నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలను రాజకీయ పక్షాల ప్రతినిధులకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూరుశాతం దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే దిశగా ఓటర్లను అవగాహన కలిగించే సీప్ అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే వరకు ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.రత్నబాబు, పి.ఆదిశేషు, బి.ప్రసాద్, ఎం.దశరథ్ కుమార్, పాలి ప్రసాద్, కె.సాంబ తదితరులు పాల్గొన్నారు.

రాముడు పేరుతో రాజకీయం

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బేబి విమర్శ



ఏలూరు టూటౌన్, జనవరి 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాముడు పేరుతో రాజకీయ డ్రామా ఆడుతోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బేబి విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధవారం శ్రీహోటల్ కన్వెన్షన్‌లో రెండో రోజు జరిగాయి. ముఖ్య అతిథిగా బేబి మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం పేరుతో పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రధాని మోదీ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారన్నారు. దేశాభివృద్ధి, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మతం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మరో పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అణచివేసే ధోరణిలో జగన్ ప్రభుత్వం సాగుతోందన్నారు. జగన్ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అంగన్వాడీ సమ్మెను పట్టించుకోకుండా 26 రోజుల తర్వాత ఎస్మా ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మీడియా గొంతు నొక్కి చట్టం తెచ్చిందన్నారు. మునిసిపల్ కార్మికులు, అంగన్వాడీలు సర్వశిక్ష ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరిపి సానుకూలంగా స్పందించకపోతే జగన్ పతనం తప్పదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్, జిల్లా కార్యదర్శి రవి, పాల్గొన్నారు.

కోఢీ

పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా సంప్రదాయ ముసుగులో సంక్రాంతి పండుగ మూడు రోజులూ యథేచ్ఛగా కోడిపందేలు,పేకాటకు నిర్వాహకులు తెర తీస్తున్నారు. గ్రామగ్రామాన జూదాలు నిర్వహణకై ఏర్పాట్లు చేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో పదుల సంఖ్యలో కోడిపందేల బరులు నిర్వహణకై పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ప్రతి చోటా పేకాట, గుండాట, భారీగా ఆడించాలని నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కలిదిండిలో కోడిపందేలకు సిద్ధమవుతున్న బరి

- కోడిపందేల బరుల ఏర్పాటు
- కొల్లేరు గ్రామాల్లో పందేల నిర్వహణకై వేలంపాటలు
- భారీగా పేకాట,గుండాటలకు మొగ్గు చూపుతున్న నిర్వాహకులు

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి/కలిదిండి, జనవరి 10 : కొల్లేరు గ్రామాల్లో ఇప్పటికే కోడిపందేలు, జూదాలు నిర్వహణకై గ్రామ కట్టుబాట్ల మధ్యన బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వీటిలో వేలంపాట పాడుకున్నవారి నిర్ణయమే తుదినిర్ణయంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇప్పటికే లక్షల రూపాయలు వెచ్చించి బరులను పాట పాడుకున్నారు. కైకలూరు మండలం శృంగవరప్పాడులో రూ.1.50 లక్షలు, పందిరిపల్లెగూడెంలో రూ.55 వేలు, చటాకాయలో రూ.60 వేలకు బరులను సొంతం చేసుకు న్నారు. అలాగే మండవల్లి మండలంలో ఇంగిలిపాకలంకలో రూ.5 లక్షలు, పులపర్రులో రూ.70 వేలు వేలం పాటలు నిర్వ హించారు. మరికొన్ని కొల్లేరు గ్రామాలైన చింతపాడు, తదితర గ్రామాల్లో ఈ పాటలను నిర్వహించనున్నారు. చింతపాడు గ్రామంలో సుమారు రూ.10 లక్షల వరకు బహిరంగంగా పాట పాడే అవకాశాలు ఉన్నాయి. ఈ గ్రామంలో కోట్లల్లో కోడిపందేలు, జూదాల పేరిట ఏటా చేతులు మారుతుం టాయి. కైకలూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహించేందుకు ఇప్పటికే అధికార పార్టీ నాయకుల దగ్గరికి ప్రదక్షణలు చేస్తున్నారు. బరులకు అనుమతుల కోసం గ్రామ, మండల స్థాయి అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు.



ఆదేశాలు బేఖాతర్

రెవెన్యూ అధికారులు తీవ్ర స్థాయిలో హెచ్చరించినా, పోలీసు అధికారులు నిఘా నిర్వహిస్తున్నా సంక్రాంతి పండుగకు జూదాల నిర్వహణకు అడ్డుకట్ట పడే అవకాశాలు కనిపించడం లేదు. కోడిపందేలు, పేకాట, ఇతర జూదాలు నిషేధమని, వాటిని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికార వర్గాలు జారీ చేసిన ఉత్తర్వులను పందేల నిర్వాహకులు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ముదినేపల్లి మండలంలో ఏటా మాదిరిగానే సంక్రాంతికి కోడి పందేలు, పేకాటల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బరులు సిద్ధమవుతున్నాయి. ముదినేపల్లి, అల్లూరు, బొమ్మి నంపాడుల్లో పెద్ద బరుల తోపాటు, పలుచోట్ల చిన్న సైజు బరులు నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధాన రహదారుల పక్కనే బరులు ఏర్పాటు చేస్తుండటం విశేషం.

- కలిదిండి మండలంలో పలు గ్రామాల్లో కోడి పందెలకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. కలిదిండిలో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో బరిని చదును చేస్తున్నారు. తాడినాడ, సానారుద్రవరం, కొండంగి, పెదలంక గ్రామాల్లో బరులు ఏర్పాటుకు అధికార పార్టీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. బరుల్లో కోతముక్క, మద్యం, గుండాట, చిత్తులాట, బిర్యాని దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ముందుగానే ఒప్పం దాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రాత్రి వేళల్లో రహస్య ప్రదేశాల్లో కోడిపందేలు వేస్తున్నట్టు సమాచారం.



ముదినేపల్లి మండలం అల్లూరు సమీపంలో పందేల బరి కోసం చదును చేసిన పొలం



స్వాధీనం చేసుకున్న తాబేళ్లను కొల్లేరులోకి వదులుతున్న అటవీశాఖ సిబ్బంది

తాబేళ్లు స్వాధీనం

- కొల్లేరులో వదిలిన అటవీశాఖ సిబ్బంది

కైకలూరు, జనవరి 10: అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న 40 బ్యాగుల తాబేళ్లను కొల్లేరులో వదిలినట్టు అటవీశాఖ డిప్యూటీ రేంజర్ జయప్రకాశ్ తెలిపారు. రేంజర్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి కలిదిండి మండలం సానారుద్రవరం వద్ద ఖాళీ ప్రదేశంలో 40 మూటల్లో తాబేళ్లు ఉన్నాయి. రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు ఏదో అలికిడి విన్పించి ఆ ప్రాంతం వైపు వెళ్లగా కొంతమంది పోలీసులను చూసి పారిపోయారు. ఆ మూటలను పరిశీలిస్తే వాటిలో తాబేళ్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ స్వాధీనం చేసుకున్న తాబేళ్లను కైకలూరు అటవీశాఖ అధికారులకు అప్పగించగా వారు వాటిని పక్షుల కేంద్రం సమీపాన కొల్లేరు సరస్సులో మంగళవారం రాత్రే వదిలినట్టు తెలిపారు.

ప్రమాదకారి..కోనోకార్పస్!

- పుప్పొడితో శ్వాసకోశ .. జీవమనుగడకు హాని
- విచ్చలవిడి పెంపకంతో ప్రజల బెంబేలు

7

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు టూటౌన్, జనవరి 10: నిబంధనల మేరకు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ, యూనియన్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరిధిలోని సమస్యలు కాకుండా స్థానికంగా పరిష్కరించ తగిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని కమిషనర్‌ను ఆదేశించారు. హెల్త్ ఆఫీసర్ మాలతి, యూనియన్ నాయకులు అప్పలరాజు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : మున్సిపల్ కార్మికులు

ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం సమ్మె నిర్వహించారు. కృష్ణచైతన్య మాట్లడుతూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు కృష్ణమాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కన్నబాబు, అప్పలరాజు, నారాయణరావు, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు భిక్షాటనతో నిరసన తెలిపారు. 16 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం దుర్మార్గమని కార్మిక నాయకులు సోమయ్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మెయిన్‌బజారు, వైఎంహెచ్ఏహాలు, జిల్లా భవన్ సెంటర్ వరకు భిక్షాటన చేశారు. కృష్ణారావు, నాగరాజు, వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఏలూరులో సామాజిక సమతా సంకల్పం

ఏలూరు కలెక్టరేట్, జనవరి 10: విజయవాడలో 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా సామాజిక సమతా సంకల్పం జిల్లా సమావేశం గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. అంబేడ్కర్ జీవితచరిత్ర తెలియజేసే ఛాయాచిత్ర, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశం నిర్వహిస్తామన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ బ్యానర్‌పై సంతకం చేసేలా ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి అంతా ఆహ్వానితులే అన్నారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 10 : జిల్లాలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఈ శ్రీనివాసులు హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో పటిష్టమైన చర్యలు తీసుకున్నామని బుధవారం ఆయన తెలిపారు. కొంత మంది సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడిపందేలు, పేకాటకు అనుమతులు ఉన్నాయని చేస్తున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. కోడి కత్తులు తయారు చేసే వారు, పేకాట నిర్వహించే వారిని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ చేసి, వారిపై నిఘా ఉంచామన్నారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 9 వరకూ 673 బైండోవర్ కేసులు నమోదు చేసి 1102 మందిని సంబంధిత తహసీల్దార్ల ముందు హాజరుపర్చామన్నారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకూ 39 పేకాట కేసులు నమోదు చేసి 231 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.4,39,951 స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందేలు నిర్వహిస్తున్న నాలుగు కేసుల్లో 18 మందిని అరెస్టు చేసి రూ.11,790 నగదు, ఏడు కోడి పుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే డయల్ 100 కాని 112 కాని లేదా 8332959175 నెంబర్, లేదా ఏలూరు డీఎస్పీ సెల్ నెంబర్ 9440796603కు సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఇబి టోల్ ఫ్రీ నెంబర్ 14500 లేదా 07382623669 నెంబర్‌కు సమాచారం అందించవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కోడిపందేలకు దూరంగా ఉండాలి : ఆర్డీవో

ఏలూరు కలెక్టరేట్, జనవరి 10: ఏలూరు డివిజన్‌లో కోడిపందేలు, జూదంపై నిషేధాజ్ఞలు ఉన్నాయని ఆర్డీవో ఎస్.ఎస్.కె ఖాజావలీ తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి జూదక్రీడలు, కోడిపందేల సమాచారం తెలిస్తే తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని సూచించారు.

● చింతలపూడి: సంక్రాంతి పండుగను పరస్కరించుకుని కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడు హెచ్చరించారు. బుధవారం చింతలపూడి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సంక్రాంతి పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట, జూదం విచ్చలవిడిగా జరగబోతున్నట్టు సమాచారం ఉందని, సమీపంలోని తెలంగాణ నుంచి కూడా అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి నిఘా ఉంచామన్నారు.

● పోలవరం: సంక్రాంతి పండుగ పేరిట కోడిపందేలు, జూదం జోలికి పోవద్దని ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడలతో మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు బి.సుమతి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జూదం నివారణపై అధికారులు ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి శ్రీను, ఎస్ఈబీ సీఐ శ్రీనివాస బాలాజీ, డీటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు


క్రికెట్ ఆడుతున్న ఆర్డీవో ఖాజావలీ

భీమడోలు, జనవరి 10 : జడ్పీ హైస్కూలు ఆవరణలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభించారు. ఆర్డీవో షేక్ ఖాజావలి క్రికెట్ ఆడి పోటీలు ప్రారంభించారు. ఈనెల 20 వరకూ మండల స్థాయి, 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయని ఎంపీడీవో పద్మావతి తెలిపారు. తొలి రోజు ఆరు క్రికెట్ టీములు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: విద్యార్థులు క్రీడా నైపుణ్యంతో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను తెల్లం రాజ్యలక్ష్మితో కలసి ప్రారంభించారు. ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కె.వరలక్ష్మి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపిటిసి తెల్లం రమణ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

● పోలవరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో కబడ్డీ పోటీలను తహసీల్దారు బి.సుమతి ప్రారంభించారు. సర్పంచ్ పొడుం పుష్ప, పంచాయతీ కార్యదర్శులు అప్పారావు, కొండలరావు, సచివాలయ సిబ్బంది ప్రసాద్, అత్తిలి సుబ్రహ్మణ్యం, వలంటీర్లు పాల్గొన్నారు.

● లింగపాలెం: సింగగూడెం పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి, సర్పంచ్ తగరం హేమలత, ఎంపీడీవో ఆశీర్వాదం, ఎంఈవోలు కె.రామారావు, జె.రవీంద్ర, హెచ్ఎం బి.శ్రీధర్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

● పెదవేగి: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఎంపీపీ తాతా రమ్య, ఎంపీడీవో జీఆర్.మనోజ్, పీడీలు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అంగన్వాడీలకు సాయం అందజేస్తున్న మాగంటి బాబు


లింగపాలెంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


చింతలపూడిలో రౌండ్ టేబుల్ సమావేశం


పోలవరం నిరసన శిబిరంలో అంగన్వాడీలు

సడలని సమ్మె

30 రోజులుగా అంగన్వాడీల ఆందోళన

లింగపాలెం, జనవరి 10: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు పట్టు సడలకుండా సమ్మె కొనసాగిస్తున్నారు. బుధవారం సమ్మె 30రోజులకు చేరుకుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అంగన్‌వాడీలను కలసి మద్దతు తెలిపారు. చిరుద్యోగులు, అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్ష సాధిస్తుందన్నారు. కనీస వేతనం మంజూరు చేయాలని, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. బీజేఎస్.కుమారి, వి.ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన శిబిరం వద్ద వివిధ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయు నాయకులు ఆర్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ రెండు నెలల్లో తమ ప్రభుత్వమే వస్తుందని, అప్పుడు పరిష్కరిస్తామని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్‌వాడీలు అడుగుతున్నారని, కాలయాపన చేయడానికే ఈ విధంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. సమావేశంలో సీపీఎం, సీఐటీయు, టీడీపీ, జనసేన, లోక్‌సత్తా, ఐద్వా, సీపీఐ(ఎంఎల్), ఎన్జీవో సంఘం, ముస్లిం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అంగనవాడీల సమ్మెకు టీడీపీ అండగా ఉంటుందని, సమస్యలు పరిష్కారమయ్యేవరకు పూర్తి మద్దతు ఇస్తామని మాజీ ఎంపీ మాగంటి బాబు తెలిపారు. అంగనవాడీల నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంగనవాడీల నేతలు కృపామణి, నూర్జహాన్, మొగపర్తి సోంబాబు, పారేపల్లి రామారావు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, గన్నిన బాస్కరావు తదితరులు ఉన్నారు.

● పోలవరం: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె బుధవారం 30 రోజుకు చేరింది. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పుకు భిన్నంగా దీక్షలపై అణచివేత చర్యలు చేయడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల నాయకురాలు పిఎల్ఎస్ కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్ర, జుబేద, వెంకటరమణ, సత్యవతి, విజయ తదితరులు పాల్గొన్నారు.


ఒంటి కాలిపై నిలబడి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కలెక్టరేట్: సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె బుధవారం 22వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. జేఏసీ నేతలు భగవాన్ తదితరులు మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు అందరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత, ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మార్పుచేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో చేరాలని నోటీసులు ఇస్తే బెదిరేది లేదన్నారు. సమస్య పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు సమ్మె శిబిరాన్ని సందర్శించారు. బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏసురాజు, తదితరులు మద్దతు తెలిపారు.




అంకన్నగూడెంలో చింతమనేని, కామవరపుకోటలో నేతలు, ఏలూరులో బడేటి చంటి తదితరుల భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచారం

ప్రజలు సీఎం సీటునే మారుస్తారు

పెదవేగి, జనవరి 10: ఓటమి భయంతో జగన్‌రెడ్డి ఎమ్మెల్యేల స్థానాలను మార్పుతున్నాడని, ప్రజలు సీఎం సీటునే మారుస్తారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అంకన్నగూడెం, బి.సింగవరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో వివరించారు. రాష్ట్ర విభజనతో లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చి, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తే, ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేదు. సరికదా ఉన్న పరిశ్రమలను పారదోలిన అసమర్థ ముఖ్యమంత్రి అని విమర్శించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటవుతుందని ప్రభాకర్ తెలిపారు. బొప్పన సుధాకర్, దేవరపల్లి బక్కయ్య తాతా సత్యనారాయణ, ఆడపా శ్రీను, ప్రసాద్, ఆదామ్, మామిళ్ళపల్లి సురేష్, చందు శ్రీనివాస్, భారీఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

● దెందులూరు: వైసీపీ పని అయిపోయిందని టీడీపీకే భవిష్యత్ ఉందని వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరడమే దీనికి నిదర్శనమని చింతమనేని ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మేదినరావుపాలెం శివారు ధర్మారావుపేటలో మాగంటి నారాయణప్రసాద్, మోతుకూరి నానిబాబు ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు గారపాటి రంగయ్య, కొమ్మన ప్రసాద్, గారపాటి గోపి, మురళి, గుడపాటి భీష్మ, టీడీపీ నేతలు ఉన్నారు.

● ఏలూరు టూటౌన్: రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 28వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. జగన్ అరాచక పాలనపై ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ 6 పథకాలు వివరించారు. కార్యక్రమంలో రెడ్డి నాగరాజు, తంగిరాల అరుణసురేష్, కృష్ణవేణి, మనోహర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వజీర్‌ఖాన్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల బ్రోచర్లను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓట్లువేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ మల్లెల్లి పృధ్విరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అనుసరించండి


ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్లు, అధికారులు

ఏలూరు టూటౌన్, జనవరి 10: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు అనుసరించాలని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ఈ నెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, నిర్వహించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని సామాజిక న్యాయమార్గంలో నడుస్తామని విద్యార్థులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, మెప్మా పీడీ ఇమ్మానియేలు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, పీవో కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు గురునాథ్, విజయ్‌కుమార్‌జైన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎస్టీయూ నేతలు

చింతలపూడి, జనవరి 10: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 75 సంవత్సరాల వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎస్టీయు ఉపాధ్యాయ ప్రతినిధులు 75 మొక్కలు నాటారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముప్పిడి శామ్యూల్ మాట్లాడుతూ కర్నూలులో 12, 13 తేదీల్లో వజ్రోత్సవాలు జరుగుతాయన్నారు. ఎంపీపీ బి.రాంబాబు, యూనియన్ నాయకులు ప్రభాకర్, వేణు, కిరణ్‌బాబు, జి.రామారావు పాల్గొన్నారు.

అభయాంజనేయుడి హుండీ ఆదాయం రూ.9.85 లక్షలు

పెదపాడు, జనవరి 10: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. 69 రోజులకు రూ.9,85,505 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ ఛైర్మన్ నెర్సు భూషణం, ఏలూరు గ్రూప్ దేవస్థానాల ఈవో రామాంజనేయులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.

పొగాకు సాగుపై రైతులకు శిక్షణ

జీలుగుమిల్లి, జనవరి 10: వర్జీనియా పొగాకు సాగుపై సీటీఆర్ఐ హెడ్ వై.సుబ్బయ్య ఆధ్వర్యంలో రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అధికారి ఎం.శేషమాధవ్ అవగాహన కల్పించారు. నారుమడి నుంచి పొగాకు అమ్మకం వరకు ఉన్న దశలను వివరించారు. జి.దామోదర్, ఆర్ఎం ఆదిశేషయ్య, శాస్త్రవేత్తలు కె.సరళ, డి.కస్తూరి, కృష్ణ, వెంకటేశ్వరావు, సింహాచలం, రమేష్ ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పోలవరం, జనవరి 10: పోలవరం బెస్తావీధిలో నివాసం ఉంటున్న శతాధిక వృద్ధురాలు పసుపులేటి వరహాలమ్మ (105) బుధవారం మృతి చెందారు. ఐదు తరాల కుటుంబ నేపథ్యం ఉన్న ఆమె పది రోజులుగా శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు రామాయమ్మ, చంద్రకళ తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు


కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

ఏలూరు క్రైం, జనవరి 10: డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, పరిమితికి మించి వేగంగా వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ ఎస్ఐలు శ్రీధర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలో బుధవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి లైసెన్సు లేని పలువురు బాలురని గుర్తించి వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐలు మాట్లాడుతూ వాహనాలు అత్యంత జాగ్రత్తగా నడపాలని, నిర్లక్ష్యంగా వాహనం నడిపితే ఎదుటివారి ప్రాణాలకు ప్రమాదం ఉందన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు, ఇన్సూరెన్సు, డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 10: బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయిందని యూనివర్సిటీ రీజినల్ కో-ఆర్డినేటర్ సతీష్ బుధవారం తెలిపారు. ఇంటర్మీడియట్/ఓపెన్ ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, రెండేళ్ల ఐటీఐ ఉత్తీర్ణులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని వివరించారు. అడ్మిషన్లకు ఈ నెల 31 గడువు అన్నారు. పూర్తివివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ లేదా రీజినల్ సెంటర్ ఫోన్‌నెంబరు 73829 29604లో సంప్రదించాలన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర ఫీజు ఈ నెలాఖరులోగా చెల్లించాలన్నారు.

సాంకేతిక వనరులను అందిపుచ్చుకోవాలి

పెదపాడు, జనవరి 10: ఇంజనీరింగ్ విద్యార్థులు అందుబాటులో వున్న సాంకేతిక వనరులను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని భీమవరం డిప్యూటీ కలెక్టర్, కళాశాల పూర్వ విద్యార్థి కానాల సంగీత్ మాధుర్ తెలిపారు. సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అలుమిన్స్ టాక్‌పై బుధవారం జరిగిన కార్యక్రమంలో సంగీత్ మాధుర్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, కె.హరిరామకృష్ణంరాజు, తేజోమూర్తి, హేమలత పాల్గొన్నారు.

పోలవరం సీఐగా మధబాబు బాధ్యతల స్వీకరణ

పోలవరం, జనవరి 10: పోలవరం సీఐగా గుమ్మల మధుబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన విజయ్‌బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మధుబాబు వచ్చారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడడానికి కృషి చేస్తానన్నారు. సీఐకు పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పోలవరం, జనవరి 10: పోలింగ్ స్టేషన్ల నిర్వహణలో అధికారుల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు బి సుమతి సూచించారు. పోలవరం మండలం వింజరం గ్రామంలో పోలింగ్ స్టేషన్లను బుధవారం రెవెన్యూ సిబ్బందితో పరిశీలించారు. వసతులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి అసౌకర్యాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.


జయహో బీసీ కార్యక్రమంలో గన్ని, గోరుముచ్చు గోపాలయాదవ్, నేతలు

బీసీల వెన్ను విరిచిన జగన్ : గన్ని

భీమడోలు, జనవరి 10: నిధులు, విధులు లేని కార్పొరేషన్లతో సీఎం జగన్ బీసీల వెన్ను విరిచారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గుండుగొలనులో బుధవారం జయహో బీసీ కార్యక్రమంలో ఆయనతోపాటు గోరుముచ్చు గోపాల్ యాదవ్ మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ కార్పొరేషన్లు కొనసాగించి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శివబత్తిన వీర వెంకట సత్యనారాయణ, పట్నాల వెంకటేశ్ బాబు, పెద్దిరాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలందరికీ బీసీలంతా వివరించాలని మాజీ ఎంపీ మాగంటి బాబు అన్నారు. ఆడమిల్లిలో బుధవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమానికి టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జీ అధ్యక్షత వహించారు. మాగంటి బాబు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. బీసీ సాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. బీసీ సాధికార సమితి డైరెక్టర్లు చిత్రోజు తాతాజీ, బేబు ప్రసాద్ మాట్లాడారు. గోరుముచ్చు గోపాల్‌యాదవ్, కోళ్ళ నాగేశ్వరరావు, జగ్గవరపు ముత్తారెడ్డి, కిలారు సత్యనారాయణ, సాయల సత్యనారాయణ, గూడపాటి కేశవరావు, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, వేముల నాగేశ్వరరావు, తూటికుంట రాము, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీధర్


శ్రీధర్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం, జనవరి 10: టీడీపీ చింతలపూడి నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్‌గా చెరుకూరి శ్రీధర్ నియమితులయ్యారు. పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం శ్రీధర్‌ను సత్కరించారు. నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు, జగ్గవరపు ముత్తారెడ్డి, పెనుమర్తి రామ్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, తూటికుంట రాము, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్, కాసాని ప్రసాద్, నాయుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడే యోచనలో బుగ్గా !

కొయ్యలగూడెం, జనవరి 10: వైసీపీ పోలవరం మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ బుగ్గా మురళి పార్టీని వీడే యోచనలో వున్నట్లు సమాచారం. ఇప్పటికే ఇదే విషయాన్ని పార్టీ అనుచరులకు చేరవేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వీర విధేయునిగా ఉన్నారు. గత మండల పరిషత్ ఎన్నికల్లో ఆయనకు ఎంపీపీ పదవి ఇస్తామని భరోసా కల్పించడంతో పోలవరం-3 ఎంపీటీసీగా పోటీ చేశారు. మిగిలిన ఎంపీటీసీల విజయానికి కృషి చేశారు. కాని, పార్టీ అధినాయకత్వం మాత్రం సుంకర వెంకటరెడ్డికి ఎంపీపీ పీఠం కట్టబెట్టింది. తనకు మాట ఇచ్చి మరొకరికి పదవి ఇవ్వడంతో మురళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే బాలరాజు ఎంపీపీ పదవిని చెరో రెండున్నరేళ్లు ఇస్తామని బుజ్జగించారు. బాలరాజు మాటలు నమ్మారు. మరో రెండు నెలల్లో రెండున్నరేళ్ల సమయం పూర్తవుతుండడంతో ఎంపీపీ పదవి ఇప్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యారు. పార్టీ కోసం విలువైన సమయాన్ని, కోట్ల రూపాయను వెచ్చించానని, అయినా తగిన గుర్తింపు లేదని అనుచరుల వద్ద వాపోయారు. పార్టీని వీడే యోచనలో ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయ త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో బాగంగా చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు.
- **ఏలూరు రూరల్ :** నగరంలో పలురోడ్లు, డ్రైన్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ళనాని బుధవారం శంకుస్థాపన చేశారు. 40, 41వ డివిజన్‌లో రోడ్లు, ఆరు డ్రైనేజిలు, కమ్యూనిటీహాల్ ఆధునికీకరణకు శంకుస్థాపన చేశారు. మేయర్ నూర్జహాన్, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **చింతలపూడి :** ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్ కృష్ణజ్యోతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు.
- రాష్ట్రానికి వచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్‌ను విజయవాడ విమానాశ్రయంలో చింతలపూడి మండల కాంగ్రెస్ నేతలు వి.సుందరరావు ఆధ్వర్యంలో కలిశారు.
- **పెదవేగి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రైల్వేబోర్డు సభ్యుడు గుమ్మడి చైతన్య అన్నారు. వేగివాడ, చక్రాయగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడారు. సర్పంచ్ పంది ప్రభావతి, ఎంపీటీసీ కొనకళ్ళ లక్ష్మి పాల్గొన్నారు.
- **పెదపాడు :** ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. జడ్పీ జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ బత్తుల రత్నకుమారి, సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి ప్రారంభించారు.
- **జంగారెడ్డిగూడెం :** పట్టణంలోని ప్రియదర్శని విద్యా సంస్థల అధినేత అలుగు ఆనంద శేఖర్ పీడీఎస్‌యూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ. భూషణం, బి.వినోద్, కె.రవి, వి.ఆర్య పాల్గొన్నారు.
- **లింగపాలెం :** అయ్యప్పరాజుగూడెం, కొణిజర్ల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. చక్రధరరావు, ఎంపీడీవో ఆశీర్వాదం, పలువురు అధికారులు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** ఇటీవల మృతి చెందిన జూనియర్ అసిస్టెంట్ దామిశెట్టి వెంకటేశ్వరరావు(ఉండి మండలం కోలమూరు) కుటుంబాన్ని డీపీవో తూతిక విశ్వనాథ శ్రీనివాస్, శైలజ దంపతులు పరామర్శించారు.
- **టి.నరసాపురం :** ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎ.రాము హెచ్చరించారు. ఎంపీడీవో మంగా కుమారి అధ్యక్షతన ప్రజావేదికలో డ్వామా పీడీ, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి సోషల్ ఆడిట్‌పై విచారణ నిర్వహించారు.
- **బుట్టాయగూడెం :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోలవరానికి చెందిన పి.ఏడుకొండలుకు మాజీ ఎంపీ మాగంటి బాబు రూ.పది వేల ఆర్థిక సాయం అందజేశారు.





క్షీరగ్రంథి రూపం, అర చేతి నిర్మాణం


అనాటమి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వైద్య విద్యార్థినులు





ముగ్గుల్లో హైలిన్ మృదులాస్థి, డోర్సాల్ రూట్ గాంగ్లియన్

ముగ్గుల్లో వైద్య విజ్ఞానం

వైద్య విద్యార్థినులకు వినూత్న పోటీ

ఏలూరు క్రైం, జనవరి 10: సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గులు గుర్తుకు వస్తాయి. ఆడపిల్లల్లో ముగ్గులపై ఆసక్తిని గుర్తించిన ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల అనాటమి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్యామల వినూత్న పోటీ నిర్వహించారు. వైద్య విద్యను, విజ్ఞానాన్ని, తెలియజేసే విధంగా బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. రంగు రంగుల ముగ్గులతో ఆ విద్యార్థులు తమ నైపుణ్యంతో ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో అనాటమి (మానవ అవయవ) విభాగంలోని వివిధ అవయవాలు తెలియజేసే విధంగా ముగ్గులను వేసి తమ ప్రతిభను చాటారు. మొత్తం మీద ఆరు బృందాలుగా ఏర్పడిన మెడికో విద్యార్థినులు పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. దీంతో వారందరినీ డాక్టర్ శ్యామల అభినందించారు.

● పెదపాడు: వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థినుల సమక్షంలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రంగుల రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలతో విద్యార్థినులు సందడి చేశారు. హరిదాసు వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

నేడు సంక్రాంతి సంబరాలు : సెట్‌వెల్ సీఈవో

ఏలూరు కల్చరల్: రాష్ట్ర సాహిత్య అకాడమీ, జిల్లా యంత్రాంగం, వైఎంహెచ్ఏ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సెట్‌వెల్ సీఈవో మెహర్రాజ్ బుధవారం తెలిపారు. వైఎంహెచ్ఏ హాలులో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, కవి సమ్మేళనం, కూచిపూడి, జానపద నృత్యాలు, సాహిత్య అవధానం, హరికథ, భువన విజయం, సాహిత్య గోష్ఠి, కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

● ధర్మభేరి ప్రాంగణంలో ఈ నెల 13 నుంచి 15 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు నారా శేషు తెలిపారు. రంగవల్లుల పోటీ, చిన్నారులకు భోగిపండ్లు, యువతకు గాలిపటాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో ఈ నెల 14న జరిగే మన ఊరి సంక్రాంతి సంబరాలు జరుగుతాయని నిర్వాహకులు జి.పవన్ కల్యాణ్, కె.రవి తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, విలువిద్య, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, చెస్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టైరు పేలి.. అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

భీమవరం నుంచి విజయవాడ వెళుతుండగా.. తప్పిన ప్రమాదం



ఉంగుటూరు, జనవరి 10 పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. గుడివాడ దాటాక భయంకరమైన గోతుల రోడ్డు కారణంగా టైరు పేలటంతో అదుపు తప్పిన బస్సు పక్కనే వున్న గోతిలో దిగబడటంతో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. భీమవరం నుంచి వయా మానికొండ మీదుగా సుమారు 40 మంది ప్రయాణికులతో అల్ట్రా డీలక్స్ బస్సు బుధవారం మధ్యాహ్నం విజయవాడ బయల్దేరింది. మానికొండ సెంటర్ దాటి జడ్పీ హైస్కూల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా పెద్ద శబ్దంతో టైరు పేలి అదుపు తప్పింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రయాణికులు హాహాకారాలు చేశారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో బస్సు రోడ్డు పక్కనే వున్న పెద్ద గుంతలో దిగబడి పక్కకు ఒరిగింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమాయంలో ఎదురుగా ఏదైనా వాహనం వచ్చివుంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెప్తున్నారు. గోతులమయమైన రోడ్డును చూసి ప్రయాణికులు స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానికి శపనార్థాలు పెట్టారు.

ఎస్వీసీ సినిమాస్ మల్టీప్లెక్స్ ప్రారంభం



దిల్ రాజును అభినందిస్తున్న అంబికా కృష్ణ

ఏలూరు, జనవరి 10: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్వీసీ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను నిర్మాత దిల్ రాజుతో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్ నుంచి నిర్మాతగా ఎదిగిన దిల్ రాజు, అన్నయ్య శిరీష్‌తో కలిసి తన సామ్రాజ్యాన్ని విస్తరించడాన్ని నిర్మాత అంబికా కృష్ణ అభినందించారు. తాజాగా ఆయన ఏలూరులో కొత్త మల్టీప్లెక్స్ నిర్మించారన్నారు. నాలుగు స్క్రీన్స్‌తో 850 సిట్టింగ్ కెపాసిటీ ఉంది. లావణ్య, ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు, నిర్మాతలు ఉషా బాలకృష్ణ, ఆకర్ష్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి


ముగ్గుల పోటీల్లో అనంతశ్రీరామ్

జంగారెడ్డిగూడెం, జనవరి 10 : మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ అన్నారు. తపన ఫౌండేషన్ సహకారంతో జేఆర్జీ కమ్యూనికేషన్ నెట్వర్క్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో సంక్రాంతి సంబరాలు బుధవారం జరిగాయి. ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంబరాల్లో భోగి మంటలు, భోగి పళ్ళు , కోలాటంతో పాటు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆహ్వానం మేరకు తాను వచ్చినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ నమోదు

ఏలూరు, జనవరి 10: నిరుద్యోగ యువత ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ ద్వారా ఎంపాయిమెంట్ నమోదు చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లు, మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా అందించే సేవలన్నింటిని ఎన్‌సీఎస్ పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి అభ్యర్థనను ఆమోదించిన వారికి ఎస్ఎమ్ఎస్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియజేస్తారన్నారు. అభ్యర్థి తన ఎంప్లాయిమెంట్ కార్డు లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే సదుపాయం ఉన్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యులపై దాడులు సహించం



మాట్లాడుతున్న డాక్టర్ శ్యాంసుందర్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 10 : విధి నిర్వహణలోవున్న ప్రభుత్వ వైద్యులపై అకారణంగా జరుగుతున్న దాడులు, బదిలీలను ఖండిస్తున్నట్టు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.శ్యాంసుందర్, డాక్టర్ బి.దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఏలూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యులకు ముఖ ఆధారిత గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్) వర్తింపజేయడం దారుణమన్నారు. దీని నుంచి మినహాయించమని సీఎం జగన్‌కు నివేదించామన్నారు. మెడికల్ డైరెక్టరేట్, వైద్యవిధాన పరిషత్, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో తరగతులా..

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 10:సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలంటూ పీడీఎస్‌యూ నేతలు బుధవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ, ఈ నెల 18 వరకు అన్ని విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించగా, సాక్షాత్తూ జిల్లా కేంద్రంలోనే విద్యాశాఖ ఉత్తర్వులు అమలు కావడంలేదని, యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయి తనిఖీ అధికారులైన ఎంఈవోలు, డీవైఈవోలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ నరసింహారావు, ఏలూరు డీవైఈవో సీసీ వంశీలకు వినతిపత్రాలు అందజేశారు. సంఘ నేతలు క్రాంతి, యశ్వంత్, రేవంత్, విష్ణు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలకు సెలవులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 10 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలకు ఈ నెల 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని ఏపీ లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.అంబేడ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐవో) చంద్రశేఖరబాబును కలిసి సెలవు రోజుల్లో ప్రైవేటు, కార్పోరేట్ కళాశాలలు తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 18న కళాశాలలను తెరుస్తారని, తరగతులు నిర్వహిస్తుంటే ఫిర్యాదు చేయాలని ఆర్ఐవో సూచించారు.

ఏపీటీఎఫ్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా ప్రకాశ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 10: ఏపీటీఎఫ్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షునిగా ప్రకాశ్ ఎన్నికయ్యారు. తాడేపల్లిగూడెం కడకట్ల మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్.మంజుల ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా టీవీ నారాయయణ, ఉపాధ్యక్షులుగా డీ.ఝాన్సి, విజయకుమారి, లంక రాజు , ఎ.వీరభద్రరావు, కె.రాంబాబు , కార్యదర్శులుగా బి.జనార్ధన్‌స్వామి, బి.రామ్మోహన్, బి.కుమార్, టి.వి.రాఘవలు, సిహెచ్.వి.సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జి.పార్వతీదేవి, ఆడిట్ కమిటీ సభ్యులుగా విజయ్‌బాబు, పుష్పరాజ్, అంజిబాబు, కృష్ణవేణి, ఎస్.జాన్సన్ లను ఎన్నుకున్నారు.

ఉసురు తీస్తున్న లంపీస్కిన్

- వైరస్ సోకి పశువులు మృత్యువాత
- లబోదిబోమంటున్న పశుపోషకులు
- రూ.లక్షల్లో నష్టపోతున్నామని ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


వ్యాధి సోకిన ఆవుదూడలు

ఆకివీడు, జనవరి 10: కొత్త వైరస్ మూగజీవాలను బలితీసుకుంటుంది. ఈ వైరస్ గురించి వింటేనే పశుపోషకుల్లో వణుకు పుడుతుంది. ఆకివీడులో పలుచోట్ల లంపీస్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) వ్యాధి అధికంగా ఆవు దూడలు, ఎద్దులను వెంటాడుతుండడంతో మృతి చెందుతున్నాయి. గతంలో వచ్చిన బ్లూ వైరస్ కంటే లంపీస్కిన్ మరింత డేంజర్‌గా ఉండడమే కాకుండా పాడి రైతులను షేక్ చేస్తున్నాయి. ఈ వ్యాధి బారినపడి చనిపోయిన ఎద్దులు, ఆవు దూడలు ఒక్కొక్కటీ లక్షల్లో ఉంటాయని రైతులు చెబుతున్నారు. కొందరు పశువులను మేపలేక రోడ్లపైకి వదిలేస్తున్నారు.ఆవు దూడలకు చర్మంపై దద్దుర్లు రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాయి.

ఆకివీడులో ఇటీవల ఈ వ్యాధి బారినపడి ఐదు ఆవు దూడలు, ఒక ఎద్దు మృతి చెందినట్లు రైతులు తెలిపారు. అంటువ్యాధి కావడంతో నరకం చూస్తున్నామని చెప్పారు. ముందు చర్మపై పొక్కులుగా వచ్చి పెద్ద పెద్ద మచ్చలుగా మారడంతో పాటు పుళ్లుపడి మేతలు తినలేక చనిపోతున్నాయన్నారు. వైద్యులు సిఫార్సు చేసిన మందులు వాడినా పనిచేయడంలేదంటున్నారు. వైద్యులే ఈ వ్యాధికి మందులు చెప్పలేకపోతున్నారని చెబుతున్నారు. తాత్కాలికంగా వైద్య సేవలందిస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని పశుపోషకులు విజ్ఞప్తి చేశారు.

దూడలకు కూడా ఇన్సూరెన్స్ చేయాలి



లంపీస్కిన్‌కు వైద్యం చేసినా పశువులు బతకడం లేదు. 18 ఏళ్లగా పశువులను పెంచుతున్నా. కరోనా తరువాత ఈ వ్యాధి మన ప్రాంతానికి వ్యాపించింది. లక్షల విలువచేసే ఏడు ఆవు దూడలు చనిపోయాయి. ఇంగ్లీషు మందులు పనిచేయడం లేదు. ఆయుర్వేదం మందులు వాడుతున్నా. ప్రభుత్వం దూడలకు కూడా ఇన్సూరెన్స్ చేపట్టి ఆదుకోవాలి.

కోళ్ళపర్తి సుబ్రహ్మణ్య దత్తు, ఆకివీడు


ప్రభుత్వమే పరిష్కారం చూపాలి



40 ఏళ్లగా పశువులను పెంచుతున్నాం. గతంలో ఇటువంటి వ్యాధి చూడలేదు. గతంలో ఇంగ్లీషు మందులకు తగ్గాయిగానీ ఇప్పుడు ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. చనిపోతున్నాయి. గిత్త, ఎద్దు, రెండు ఆవు పెయ్యిలు చనిపోయాయి.ఈ వ్యాధికి మందులేవని వైద్యులే చెబుతున్నారు. ప్రభుత్వమే పరిష్కారం చూపాలి.

బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆకివీడు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఈ వ్యాధి దూడలకు మాత్రమే ఎక్కువగా వస్తుంది. మొదటిలోనే తుంచివేసే విధంగా టీకాలు వేయించుకోవాలి. ఇటీవల వ్యాధి ప్రబలి ఆవు దూడలు ఎక్కువగా చనిపోతున్నాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, బొడెపెలుగా రావడం, మోకాళ్ల వాపులు వంటి వాటిని గుర్తించి వైద్యం అందిస్తున్నాం. వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి.

కె.జనార్ధనరావు, వెటర్నరీ వైద్యుడు

ప్రమాదకారి..కోనోకార్పస్!

- పుప్పొడితో శ్వాసకోశ .. జీవమనుగడకు హాని
- విచ్చలవిడి పెంపకంతో ప్రజల బెంబేలు
- పూర్తిగా తొలగించాలంటూ అధికారులకు వినతి



భోగేశ్వరస్వామి ప్రధాన రహదారికిరువైపులా పెరిగిన మొక్కలు


హైస్కూల్‌లో తొలగించిన మొక్కలు

కలిదిండి, జనవరి 10 : కోనోకార్పస్ మొక్కలు మానవ మనుగడకు, పర్యావరణానికి హాని కలిగిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నా జిల్లాలో అధికారులు వీటిని విచ్చలవిడిగా పెంచడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటారు కానీ అన్ని రకాల మొక్కలు కాదు. ఇందులో కొన్ని జీవన మనుగడకు హాని కలిగిస్తాయి. అలాంటి కోవకు చెందిన మొక్కలే కోనోకార్పస్. ఇదే విషయాన్ని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. శ్వాస కోశ వ్యాధులు ఆస్మా, అలర్జీ తదితర వ్యాధుల బారిన పడతారని తేలింది. ఈ మొక్కల పెంపకంపై తెలంగాణలో నిషేధం ఉంది. కానీ కలిదిండి మండలంలో పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారికిరువైపులా మూడు కిలోమీటర్ల మేర కోనోకార్పస్ మొక్కలను అధికారులు పెంచుతున్నారు. జడ్పీ హైస్కూళ్ల ఆవరణల్లో ఈ మొక్కలను పెంచుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రహదారుల పక్కన విచ్చలవిడిగా పెంచటంతో వీటి పువ్వుల నుంచి వెలువడే పుప్పొడి వల్ల శ్వాస కోస వ్యాధులు కలుగుతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. వీటి వేర్లు వల్ల భూమిలో కేబుళ్లు, పైపులు ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. చూడడానికి అందంగా ఉండడం, ఏ ప్రదేశంలో అయినా సరే నేల స్వభావంతో సంబంధం లేకుండా ఈ మొక్కలు ఏపుగా పెరుగుతుండడం, పశు పక్ష్యాదులు వీటి జోలికి వెళ్లకపోవడంతో అధికారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మొక్కల వల్ల హాని జరుగుతుందని గుర్తించి ఇటీవల భాస్కరావుపేట, పెదలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కోనోకార్పస్ చెట్లను పూర్తిగా తొలగించారు. మిగిలినచోట్ల తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేకేరు అబ్బాయికి గిన్నీస్ బుక్‌లో చోటు


సర్టిఫికెట్ అందుకుంటున్న సీతాశ్యాం మోహన్ రెడ్డి

ఇరగవరం, జనవరి 10: మండలంలోని పేకేరుకు చెందిన మేడపాటి సీతా శ్యాం మోహన్ రెడ్డి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. అతడు దుబాయ్ మునిసిపాలిటీలో సీనియర్ మెయింటెనెన్స్ ఇంజనీర్‌గా పదేళ్లగా పనిచేస్తున్నాడు. అంధులు రహదారులు దాటేందుకు, మెట్లు ఎక్కేందుకు ఉపయోగపడే సాధనాన్ని మోహన్‌రెడ్డి బృందం తయారుచేసింది. పొడవాటి బ్రెయిలీ హ్యాండ్ రైలు (319.11మీ) నిర్మించారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను యూఏఈలో సెక్షన్ మేనేజర్ సయ్యద్ అబ్దుల్లా బిన్ స్లిమ్ ప్రదానం చేశారు.


14న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ఆకివీడు, జనవరి 10: శరీర దారుఢ్యానికి ఫిట్‌నెస్ ఎంతో అవసరమని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బిక్కిన శ్రీనివాస్ అన్నారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. 41 యువజనోత్సవాల్లో మొదటిసారిగా రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 14న జరిగే బాడీ బిల్డింగ్ పోటీలు జరుగుతాయని తెలిపారు. డీవైఎఫ్ఐ ఆహ్వాన సంఘం కార్యదర్శి గేదెల ధనుష్, నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ పాల్గొన్నారు.

క్రైం కార్నర్


కత్తితో అన్న దాడి.. తమ్ముడు మృతి

- ఆస్తి గొడవలే ఊపిరితీశాయి..


వెంకటేశ్వర్లు (ఫైల్)

పెంటపాడు/ఏలూరు క్రైం, జనవరి 10: ఆస్తి తగాదా తమ్ముడి మృతికి దారితీసింది. కత్తితో తమ్ముడిపై అన్న దాడి చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలివి. మండలంలోని ఆకుతీగపాడులో చిన్నం వెంకటేశ్వర్లు (28), అతడి అన్న చిన్నం శ్రీను రెండు పోర్షన్ల ఇంటిలో నివశిస్తున్నారు. వీరి భార్యలు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. వీరి మధ్య గతం నుంచి ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ మేరకు మంగళవారం అన్నదమ్ముల మధ్య వివాదం చోటు చేసుకుంది. అన్న చిన్నం శ్రీను తన తమ్ముడు వెంకటేశ్వర్లుపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

స్కూల్ బస్ ఢీకొని భార్యాభర్తల దుర్మరణం


ధనరాజు, మరియమ్మ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 10: పెదతాడేపల్లి జాతీయ రహదారి పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వివరాలివి. తాడేపల్లిగూడెం మండలం నందమూరుకు చెందిన గన్నవరపు ధనరాజు (34) ఫుడ్ ఫ్యాక్ట్స్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. భార్య మరియమ్మ (26) ఇద్దరు పిల్లలు, భర్తతో కలిసి ఫంక్షన్ నిమిత్తం బంధువుల ఇంటికి బైక్‌పై చేబ్రోలు వెళ్తుండగా పెదతాడేపల్లి వద్ద జాతీయ రహదారిపై తాడేపల్లిగూడెంకు చెందిన ఆదిత్య స్కూల్ బస్సు ఢీకొట్టింది. మరియమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ధనరాజు తీవ్రంగా గాయపడ్డాడు. కుమార్తె భావన, కుమారుడు సాత్విక్ జాయ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ధనరాజు మృతి చెందాడు. సాత్విక్ తలకు గాయం కావడంతో ఐసీయూలో ఉంచారు. భావన స్వల్పగాయాలతో బయటపడింది. తల్లిదండ్రులు మృతి చెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ వద్ద బస్సులను నిలుపుదల చేసేందుకు సిద్ధపడగా పోలీసులు వారించడంతో పరిస్థితి సద్దుమణిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి. రాజు తెలిపారు.

పురుగుమందు ఘాటుకు కూలీ మృతి

పెదవేగి, జనవరి 10 : పొలంలో పురుగుమందు పిచికారీ చేస్తుండగా ఘాటుకు అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలివి. రాట్నాలకుంట గ్రామానికి చెందిన పరిమి వెంకటరమణ (28), ఓ రైతు పొలంలో పురుగుమందు పిచికారీ చేయడానికి మంగళవారం కూలీకి వెళ్లాడు. అతడు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్

డివైడర్‌ను ఢీకొట్టిన ఆటో.. విద్యార్థులకు గాయాలు

ద్వారకాతిరుమల, జనవరి 10: భీమడోలులోని ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటో, డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన పంగిడిగూడెం పెట్రోల్ బంక్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ద్వారకాతిరుమల, తిమ్మాపురంనకు చెందిన ఆరుగురు విద్యార్థులు భీమడోలులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు. బుధవారం ట్యూషన్ నిమిత్తం ద్వారకాతిరుమల నుంచి ఆటోలో బయలుదేరారు. పెట్రోల్ బంక్ వద్ద ఆటో వేగంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో డి.సందీప్ కాలువిరగ్గా మరో విద్యార్థినికి స్వల్పగాయాలయ్యాయి. తొలుత భీమడోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం విర్డ్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

పెనుగొండ, జనవరి 10: ద్విచక్ర వాహనాల దొంగను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఈ నెల 9న స్థానిక ఎస్వీకేపీ కళాశాల సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానంతో మార్టేరుకు చెందిన చిర్ల జగన్మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. చెడు వ్యసనాలకు బానిసై తన స్నేహితుడు హర్షవర్ధన్ రెడ్డితో కలిసి గత ఏడాది జూన్ నుంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్లముందు, రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లను మారు తాళాలతో దొంగిలిస్తున్నారు. బుధవారం వారి నుంచి ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని అంచనా. నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఎస్.ఎన్.వి.వి. రమేష్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి చోరీ సొత్తును రికవరీ చేసినందుకు ఎస్పీ, డీఎస్పీ సిబ్బందిని అభినందించారు. ప్రోత్సాహక బహుమతి అందించారు.

పట్టపగలే వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముదినేపల్లి, జనవరి 10: పట్టపగలే ఓ వృద్ధురాలి మెడలోని బంగారపు గొలుసును ఓ దుండగుడు తెంచుకుపోయిన ఘటన బుధవారం మధ్యాహ్నం ముదినేపల్లి మండలం సింగరాయిపాలెంలో చోటు చేసుకుంది. వివరాలివి. బొంగు సింహాచలం (62) అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. ఓ అపరిచిత వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మీకు గేదెలు కావాలా? వరిగడ్డి కావాలా? అని అడిగాడు. అక్కర్లేదని ఆమె సమాధానం చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయింది. ఆ దుండగుడు ఇంటి వెనుక వైపునకు వెళ్లి మంచినీళ్లు ఇవ్వమని వృద్ధురాలిని అడిగాడు. ఆమె గ్లాసుతో నీళ్లు తెచ్చి ఇచ్చింది. ఆ గ్లాసును కింద పడేసి ఆమె మెడలో సుమారు నాలుగు కాసుల బంగారపు గొలుసును, చెవులకు ఉన్న బంగారపు జోడులను లాక్కుపోయాడు. కంగారు పడిన వృద్ధురాలు కేకలు వేయగా స్థానికులు అక్కడికి చేరేలోగా దుండగుడు ఉడాయించాడు. ఆమె కుమారుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు..

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 10 : ట్రాన్స్‌పార్మర్‌లో రాగివైరును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాల్లోకి వెళితే.. నాగులగూడెంలో గోలి వెంకటరత్నం పొలంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను పగులగొట్టి అందులో ఉన్న రాగి వైరును దొంగిలించుకుపోయారు. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన రైతు విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చాడు. చోరీకి గురైన వైరు సుమారు రూ.70 వేలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మంచు కురిసే వేళలో..

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతాన్ని పొగమంచు కమ్మేసింది. దీంతో రహదారులన్నీ మంచుతో కనబడకుండా పోయాయి. బుధవారం ఉదయం 10 గంటలు దాటినా పొగమంచు తగ్గలేదు. వాహనదారులు పగటిపూటే లైట్లు వేసి వాహనాలను నడపవలసి వచ్చింది. పలుచోట్ల పొగమంచులో చిన్నారులు ఎంజాయ్ చేశారు.

-బుట్టాయిగూడెం

శ్రీవారి కనుమ ఉత్సవానికి ఏర్పాట్లు ప్రారంభం


కనుమ మండపం

ద్వారకాతిరుమల, జనవరి 10: శ్రీవారి క్షేత్రంలో కనుమ ఉత్సవ ఏర్పాట్లు బుధవారం చురుగ్గా ప్రారంభమయ్యాయి. దొరసానిపాడు గ్రామంలో ఈనెల 16న ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. మండపాన్ని, పరిసరాలను సుందరీకరిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో పోస్టర్‌లను ఏర్పాటు చేశారు. ఉభయదేవేరులతో కొలువైన శ్రీవారు రాజాధిరాజ వాహనాన్ని అధిరోహించి క్షేత్రం నుంచి బయలుదేరి అక్కడి మండపానికి చేరుకుంటారు. 14న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని, సంక్రాంతి రోజున నిత్యార్జిత కల్యాణాన్ని రద్దు చేస్తున్నామని ఈఓ త్రినాథరావు తెలిపారు.

తొళక్క వాహనంపై ఊరేగిన శ్రీవారు


వాహనంపై ఊరేగుతున్న స్వామి

తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో కొలువుదీరిన శ్రీవారు క్షేత్రతిరువీధుల్లో బుధవారం ఉదయం ఊరేగారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ అట్టహాసంగా ఊరేగించారు. విలాస మండపంలో హారతులిచ్చి ప్రసాదాలను పంపిణీ చేశారు.


ప్రథమ బహుమతిని అందుకుంటున్న విద్యార్థినుల బృందం

జాతీయస్థాయి యువజనోత్సవాలకు ఎంపిక

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 10 : జాతీయస్థాయి యువజనోత్సవాలకు తమ కళాశాల విద్యార్థినుల బృందం ఎంపికైందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సుపీరియర్ మదర్ ఎర్నెస్టైన్ పెర్నాండెజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ తెలిపారు. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల ఏడు నుంచి తొమ్మిది వరకు ఏపీ యువజన సర్వీసులశాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల జానపద నృత్య విభాగంలో విద్యార్థిని భావనదుర్గ నేతృత్వంలోని తమ కళాశాల బృందం ప్రథమస్థానం సాధించిందన్నారు. బృందంలో జ్యోతి, హైమావతి, అఖిల, శ్రీప్రియ, లక్ష్మీ ప్రసన్న, దేదీప్య, స్వర్ణమెర్సీ, మీనా, కళ్యాణి వున్నారన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో 16 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. జాతీయస్థాయి యువజనోత్సవాలు ఈ నెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరుగుతాయని చెప్పారు. కంప్యూటర్స్ విభాగం అధ్యాపకురాలు రాధిక తర్ఫీదునిచ్చారని పేర్కొన్నారు. జానపద నృత్యం వ్యక్తిగత విభాగంలో ఎం.ప్రీతి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. బృందాన్నిసిస్టర్ ఇన్నాసమ్మ, సిస్టర్ సుశీల, సిస్టర్ మరియా క్రిస్టియానా, మహాలక్ష్మి అభినందించారు.

భీమవరంలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



భీమవరం క్రైం, జనవరి 10 : పట్టణంలోని పెద్ద మసీదు సెంటర్ వద్ద ఇతర రాష్ట్రానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి బుధవారం దుస్తులు లేకుండా హల్‌చల్ చేశాడు. గత రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో దుస్తులు లేకుండా తిరుగుతూ రోడ్డుపై వెళ్లే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బెదరగొడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రెచ్చిపోయి రెండు షాపుల్లో వస్తువులు ధ్వంసం చేయడంతో ఆషాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని అతడికి వస్త్రాలు కట్టి బుజ్జగించారు. అనంతరం అతడి బంధువులకు సమాచారం ఇచ్చారు. బాగానే ఉండేవాడని అంటున్నారు. నిజంగా మతిస్థిమితం లేదా లేక నటిస్తున్నాడా అన్న ఆలోచన కొందరిలో నెలకొంది. పోలీసులు మాత్రం తమకెందుకులే అన్నట్లుగా మూడు రోజుల నుంచి వదిలి పెడుతున్నారు.

400 మంది బైండోవర్

ఆకివీడు, జనవరి 10: సంక్రాంతి పండుగ ముందస్తు చర్యలో భాగంగా సర్కిల్ పరిధిలో 400 మందిని బుధవారం బైండోవర్ చేశామని సీఐ కె.వి.వి.ఎన్. సత్యనారాయణ తెలిపారు. ఆకివీడు, ఉండి, కాళ్ళ మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేస్తున్న కోడి పందేల బరులను ట్రాక్టర్లతో దున్నిస్తున్నామన్నారు. హైకోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేర తగిన బందోబస్తు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం/పెదవేగి, జనవరి 10 : వేర్వేరు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్ట్ చేశారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీలోని రిక్షా కాలనీలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్నారన్న సమాచారం రూరల్ ఎస్ఐ పి.రాజారెడ్డికి అందింది. సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి మండలం గార్లమడుగులో ముగ్గుర్ని అరెస్టు చేసి వారివద్దనుంచి రూ.4,200 స్వాధీనం చేసుకున్నారు. జూదరులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడ్డ రేషన్ బియ్యం

పోలవరం, జనవరి 10 : మండలంలోని గూటాలలో బుధవారం ఏలూరు విజిలెన్స్ అధికారుల దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ మాట్లాడుతూ, విజిలెన్స్ ఎస్పీ కరణంకుమార్ ఆదేశాల మేరకు గూటాల సంగీత పాఠశాల సమీపంలో గోడౌన్‌లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.నిందితుడు కక్కిరాల వీరవెంకట కృష్ణాంజనేయ అప్పలరాజు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



చాట్రాయిలో అంగన్వాడీల ఆందోళన



కైకలూరులో అంగన్వాడీల ర్యాలీ



నూజివీడులో 30 ఆకారంలో కూర్చుని నిరసన

బెదిరింపులకు భయపడం

ఎస్మా ప్రయోగంపై అంగన్వాడీలు

చాట్రాయి, జనవరి 10: ఎస్మా ప్రయోగించి తొలగిస్తామన్న ప్రభుత్వ బెదిరింపులకు భయపడి సమ్మె విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మలజ్యోతి స్పష్టం చేశారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని, సుప్రీంకోర్టు ఉత్వర్వుల ప్రకారం కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని, తాము శాంతి యుతంగా ఆందోళన చేస్తుంటే సర్కార్ నియంతలా వ్యవహరిస్తూ సమ్మెను విఫలం చేయటానికి కక్షపూరితంగా వ్యవహరిచటం దారుణం అన్నా రు. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె ఆగదన్నారు. అన్ని గ్రామాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు సచివాలయం వద్ద అంగన్‌వాడీల దీక్ష బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. హామీలను అమలుచేయలేని ఈ అసమర్థ ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి తొలగించాలని చూడటం దారుణమని వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి అన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌లను సాధించుకునే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

నూజివీడు: డిమాండ్ల సాధన కోసం నెల రోజులుగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 రోజుల సమ్మెకు సూచికగా 30 ఆకారంలో కూర్చుని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

దీక్షలకు ఏలూరు తరలిన అంగన్వాడీలు

ముదినేపల్లి: తమ డిమాండ్ల సాధనకు నెల రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు యూనియన్ పిలుపు మేరకు బుధవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలకు ముదినేపల్లి మండలం నుంచి తరలి వెళ్లారు. యూనియన్ నాయకులు సొంగా మణి, బండి పద్మ, సూరపనేని అరుణ కుమారి, ఎ.ఎల్.పద్మావతి, సీహెచ్.రమణి ఒకరోజు దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ప్రసాద్ మద్దతిచ్చారు.

కలిదిండి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలిదిండిలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. షోకాజ్ నోటీసులు జారీ చేయటం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. అంగన్‌వాడీ నేతలు పాల్గొన్నారు.

కైకలూరు: కైకలూరులో బుధవారం అంగన్వాడీలు ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళలను అని కూడా చూడకుండా పోలీసులు ఈడ్చుకెళ్లడం దారుణమ న్నారు. ఎస్మా ప్రయోగించేది అత్యవసర సేవలందించే ఉద్యోగులపైనేనని తమ సేవలు అత్యవసరమైనవి కాకపోయినా తమపై జగన్ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్నారు. శిబిరాన్ని బీసీ నాయకుడు లావేటి వీరశివాజీ సందర్శించి సంఘీభావం తెలిపారు.

మండవల్లి: మండవల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్ష బుధవారం కూడా సాగింది. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని తమ డిమాండ్లు పరిష్కరించేంతవరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని యూనియన్ నాయకులు వెల్లడించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు చెల్లమ్మ, విజయలక్ష్మి, తదితరులు ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు.



కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

నూజివీడు టౌన్, జనవరి 10: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్-2022ను రద్దుచేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు 16వ రోజుకు చేరాయి. బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే దీక్షల్లో న్యాయవాదులు లాగు చిన వెంకటేశ్వరరావు, కంచర్ల వెంకటేశ్వర రావు, షేక్ జాన్‌బాబు, కొత్రు వెంకటేశ్వరరావు, మల్లిబోయిన వంశీ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

నూజివీడు టౌన్, జనవరి 10: మున్సిపల్ కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ గత 16 రోజులుగా నిరవధిక సమ్మెబాట పట్టిన మున్సిపల్ కార్మికులు నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ కార్యదర్శులు జి.రాజు, చాట్ల పుల్లారావు మాట్లాడుతూ 2019లో జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, జయలక్ష్మి, గోవింద్, పంగిడమ్మ, ఉషారాణి, ఏడుకొండలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో చెత్త తొలగింపు

నూజివీడు టౌన్, జనవరి 10:మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మెతో ఎక్కడిచెత్త అక్కడే నిలిచిపోవడంతో నూజివీడు పట్టణంలోని ప్రధాన కూడళ్ళు చెత్తమయంగా మారాయి. దీంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్లతో చెత్తను ట్రాక్టర్‌లో లోడ్‌చేసి పారిశుధ్య మెరుగుదల చర్యలను చేపట్టారు.

అభివృద్ధి జాడేదీ : ముద్దరబోయిన

నూజివీడు, జనవరి 10: అసమర్థుల చేతుల్లో అటు రాష్ట్రం, ఇటు నియోజకవర్గంలో అభివృద్ధి జాడే లేదని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వైసీపీ పెద్దలు కేంద్రీయ విద్యాలయం పేరుతో మండల పరిషత్ ఆస్తులను రూ.80 లక్షల మున్సిపల్ నిధులతో అభివృద్ధి చేశారన్నారు. ఏ నాయకుడి ఆదేశాల ప్రకారం చేశారో మంజూరు చేసింది ఎవరు? ఒకవేళ రికవరీ చేయాలంటే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారో అధికార పెద్దలు పట్టణ వాసులకు చెప్పాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతలను నిలిపివేసినప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా రైతులకు స్థానిక వైసీపీ నాయకత్వం ద్రోహం చేసిందన్నారు. అసమర్థతతో అసెంబ్లీలో మాట్లాడ లేని వారు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపలేని వారు నాయకత్వంలో ఉండటం దురదృష్టమని ప్రజలు సరైన సమయంలో తగు నిర్ణయం తీసుకుని బుద్ధిచెప్తారన్నారు. టీడీపీ నాయకుడు దేవినేని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ సభలను విజయంతం చేయండి

కైకలూరు, జనవరి 10: టీడీపీ తలపెట్టిన జయహో బీసీ సభలను విజయవంతం చేయాలని కైకలూరు నియోజవకర్గ పార్టీ పరిశీలకుడు మెంటే పార్థసారథి పిలుపునిచ్చారు. బుధవారం కైకలూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో టీడీపీ జయహో బీసీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఒక్కో రోజు జయహో బీసీ సభను నిర్వహించాలన్నారు. కైకలూరు నియోజవర్గానికి సంబంధించి ఈ నెల 23న ముదినేపల్లి, 24న కలిదిండి, 25న మండవల్లి, 26న కైకలూరులో సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సభకు ఆయా మండలంలోని పార్టీలకతీతంగా బీసీలంతా పాల్గొని జగన్మోహనరెడ్డి బీసీలకు చేస్తున్న అన్యాయాలను వివరించాలన్నారు. ప్రతి మండలంలోనూ ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ఆయా మండలాల పార్టీల అధ్యక్షులు, బీసీ నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, నారగాని నాగేశ్వరరావు, పోకల జోగిరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌వో

మేలైన యాజమాన్య పద్ధతులతో మామిడి దిగుబడులు అధికం

చాట్రాయి, జనవరి 10: మామిడి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానశాఖ అధికారిణి హేమ సూచించారు. చాట్రాయి, నరశింహారావుపాలెం గ్రామాల్లో మామిడి తోటలను ఆమె రైతులతో కలిసి పరిశీలించారు. పూతరాని తోటల్లో మల్టీకే 10 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, జింక్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలన్నారు. పూత వచ్చిన తోటల్లో పచ్చిపూతపై తేనే మంచు పురుగు ఉంటే ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి, లేదా ఇమిడాక్లోఫ్రిడ్ 0.5 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెగుళ్ళు ఆశించే తోటల్లో కార్బండిజమ్ 2 గ్రాములు లీటరు నీటికి, లేదా సాఫ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు. ఆర్బీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పట్టపగలు వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముదినేపల్లి, జనవరి 10 : పట్టపగలు ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు, చెవి దిద్దులను ఆగంతుకుడు తెంచుకుపోయిన ఘటన బుధవారం ముదినేపల్లి మండలం సింగరాయి పాలెంలో జరిగింది. గామానికి చెందిన బొంగు సింహా చలం (62) అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో ఓ అపరిచిత వ్యక్తి వచ్చి మీకు గేదెలు కావాలా? వరి గడ్డి కావాలా? అని ప్రశ్నించగా అక్కర్లేదని ఆమె సమాధానం చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయింది. ఆగంతుకుడు ఇంటి వెనుక వైపు నుంచి వెళ్లి మంచినీళ్లు ఇవ్వమని అడగడంతో వృద్ధురాలు నీళ్లివ్వగా గ్లాసును కింద పడేసి ఆమె మెడలోని సుమారు నాలుగు కాసుల బంగారు గొలుసు, చెవులకున్న దిద్దులను లాక్కుని ఆ వ్యక్తి పరారయ్యాడు. వృద్ధురాలు కేకలు వేయగా స్థానికులు అతనిని వెతికినా ఫలితం లేకపోయింది. బాధితురాలి కుమారుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకట్ కుమార్, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



బాధితురాలు సింహాచలం

స్కూల్ బస్ ఢీకొని భార్యాభర్తల దుర్మరణం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 10: పెదతాడేపల్లి జాతీయ రహదారి పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వివరాలివి. తాడేపల్లిగూడెం మండలం నందమూరుకు చెందిన గన్నవరపు ధనరాజు (34) ఫుడ్ ఫ్యాక్ట్స్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. భార్య మరియమ్మ (26) ఇద్దరు పిల్లలు, భర్తతో కలిసి ఫంక్షన్ నిమిత్తం బంధువుల ఇంటికి బైక్‌పై చేబ్రోలు వెళ్తుండగా పెదతాడేపల్లి వద్ద జాతీయ రహదారిపై తాడేపల్లిగూడెంకు చెందిన అదిత్య స్కూల్ బస్సు ఢీకొట్టింది. మరియమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ధనరాజు తీవ్రంగా గాయపడ్డాడు. కుమార్తె భావన, కుమారుడు సాత్విక్ జాయ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ధనరాజు మృతి చెందాడు. సాత్విక్ తలకు గాయం కావడంతో ఐసీయూలో ఉంచారు. భావన స్వల్పగాయాలతో బయ టపడింది. తల్లిదండ్రులు మృతి చెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ వద్ద బస్సులను నిలుపుదల చేసేందుకు సిద్ధపడగా పోలీసులు వారించడంతో పరిస్థితి సద్దుమణిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి. రాజు తెలిపారు.



పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఎన్నికల విధులపై పోలీస్ సిబ్బందికి శిక్షణ

నూజివీడు, జనవరి 10: ఎన్నికల నిర్వహణపై నూజివీడు సబ్ డివిజన్‌లోని పోలీసులకు స్థానిక సారథి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల విధులపై శిక్షణా తరగతులను నిర్వహించారు. సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి పరిస్థితుల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఏ చర్యలు చేపట్టకూడదు అనే విషయమై ఆయన శిక్షణ ఇచ్చారు.

యువ ఫౌండేషన్ దుప్పట్ల వితరణ



కలిదిండి, జనవరి 10 : కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణంలో బుధవారం యువ ఫౌండే షన్ ఆధ్వర్యంలో అందించిన దుప్పట్లను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులకు సాయమందించటానికి యువ ఫౌండేషన్ ముందుకు రావటం అభినందనీయమన్నారు. పేదలకు మరిన్ని సేవలందించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, సర్పంచ్ మారుతి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అట్లూరి ట్రస్ట్ సేవలు భేష్



ముసునూరు, జనవరి 10: అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీ యమని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధురాలు రాచూరి సమాధానం ఇల్లు ఇటీవల దగ్ధమై కట్టుబట్టలతో మిగలగా బుధవారం సర్పంచ్‌తో కలసి ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర బాధితురాలికి రూ. 5 వేలు నగదుతోపాటు రూ. 5వేలు విలువ గల వంట సామగ్రి, కొత్త దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు.

రెండు గ్రామాల్లో సంకల్ప యాత్ర

చాట్రాయి, జనవరి 10: మండలంలోని కొత్తగూడెం, సోమవరం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్, బీజేపీ నాయకుడు ఆముదాల ఇస్సాక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సబ్ కలెక్టర్

యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

ముసునూరు, జనవరి 10: యువత క్రీడల్లో నైపుణ్యం సాధించి ఉన్నతస్థాయికి వెళ్లాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. ముసునూరు జడ్పీపాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి ఆటల పోటీలను ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, సర్పంచ్ కంచర్ల వాణి, ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ, ఎంఈవో సుబ్బారావు, పీడీలు అలీఖాన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో నూజివీడును ఉన్నతంగా నిలపాలి



నూజివీడు టౌన్, జనవరి 10: క్రీడల్లో నూజివీడును ఉన్నతంగా నిలిపేందుకు గ్రామీణ క్రీడాకారులు కృషి చేయాలని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నూజివీడు ఎంపీడీవో విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్య సమాజం

చాట్రాయి: యువత నిత్యం తమకు ఇష్టమైన క్రీడను అభ్యసిస్తే ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని మండల స్పెషలాఫీసర్, డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటరత్నం అన్నారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో పలు గ్రామాల జట్లు పాల్గొన్నాయి. వ్యాయామోపాధ్యాయులు సతీష్‌కుమార్, ప్రభాకరరావు, విజయ్, వెంకట్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి, ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపిడివో దినతేజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించారు.

కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేయండి



ముదినేపల్లి, జనవరి 10 : రాష్ట్ర ఎన్నికలపై విజయవాడలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ సీనియర్ నాయకులను పీసీసీ సభ్యుడు బాబ్జీ కలిశారు. గన్నవరం విమానాశ్ర యంలో పలువురు నాయకులతో కలసి ఏపీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్, ఎన్నికల పరిశీలకులు, ఎంపీ మయిప్పన్‌కు స్వాగతం పలికారు. ఏపీలో పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని నాయకులు తెలిపినట్లు బాబ్జీ తెలిపారు.



యువజనోత్సవాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, జనవరి 10: ఇటీవల గుంటూరు జిల్లాలోని కె.ఎల్. యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభాపాటవాలు కనబర్చినట్లు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. జానపద బృందగానం విభాగంలో వై.సుప్రియ బృందం ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. వీరు ఈ నెల 12 నుంచి నాసిక్‌లో నిర్వహిస్తున్న 27వ జాతీయస్థాయి యువజనోత్సవాల్లో ఆర్జీయూకేటీ తరపున పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏవో ప్రదీప్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

'విజయ డెయిరీ లాభాలు రైతుల సంక్షేమానికే'

చాట్రాయి, జనవరి 10: విజయ డెయిరీకి వచ్చిన లాభాలను తిరిగి రైతుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నట్లు తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి అన్నారు. మండలంలోని తుమ్మగూడెంలో బుధవారం విజయ డెయిరీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతు చనిపోతే క్షీరబంధు పథకం కింద రూ 50 వేలు, కల్యాణమస్తు ద్వారా రైతుల పిల్లల వివాహాలకు రూ. 20 వేల విలువైన బంగారు నాణెం, చదుకునే పిల్లలకు రూ. 25 వేలు, ఏడాదికి మూడు సార్లు బోనస్ తదితర ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పాడిరైతు చాగంటి పుష్పావతి కుమారుడు సామ్యూల్ రాజ్ వివాహం సందర్భంగా రూ. 20 వేలు విలువైన బంగారు నాణెం అందజేశారు. సంఘ అధ్యక్షురాలు మందలపు పద్మావతి, సూపర్‌వైజర్ శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ ప్రజాధనాన్ని కాపాడండి!

ఇండోర్ స్టేడియం, టెన్నిస్ కోర్టుల గతి అంతేనా : జనసేన



టెన్నిస్‌కోర్టు దుస్థితి చూపుతున్న కామేష్

నూజివీడు టౌన్, జనవరి 10: ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాల్సిన బాధ్యత మీది కాదా? ఎమ్మెల్యే గారు.. అంటూ జనసేన నూజివీడు నాయకులు పట్టణంలోని క్రీడా స్థలాల దుస్థితిపై ప్రశ్నించారు. పాలడుగు వెంకట్రావు ఎమ్మెల్సీగా ఉండగా, నిర్మాణం ప్రారంభమైన ఇండోర్ స్టేడియం, మైలవరం రోడ్డులో గల టెన్నిస్ కోర్టు నిరుపయోగం కావడంపై జనసేన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడు జనసేన నాయకుడు ముత్యాల కామేష్ మాట్లాడుతూ నూజివీడులో 15 ఏళ్ల క్రితం నిర్మాణం ప్రారంభమైన ఇండోర్ స్టేడియం దాదాపు 70 శాతం పూర్తి కాగా మిగతాది పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేయటం దారుణమన్నారు. అలాగే టెన్నిస్‌కోర్టు సైతం పిచ్చిమొక్కలకు నిలయంగా మారిందని, దాన్ని వాడుకలోకి తేవాలని కోరారు. నూజివీడు మండల జనసేన ఉపాధ్యక్షుడు యింటూరి చంటి, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

నూజివీడు టౌన్, జనవరి 10: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నూజివీడు నియోజకవర్గంలో వారం రోజులపాటు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్నట్టు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి కమిటీ సభ్యుడు కె.అశోక్‌బాబు తెలిపారు. తొలిరోజు ఆచార్యప్రబోధానంద యోగీశ్వరస్వామి జ్ఞాన ప్రచారంలో భాగంగా నూజివీడు పట్టణంలో దత్తులూరి కమిటీ సభ్యులు ప్రచారాన్ని నిర్వహించారు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక వి.కోట, పొదలకూరు, దత్తులూరు కమిటీ అధ్యక్షులు అశోక్‌బాబు, నర్సయ్య, ప్రసాద్, నర్రా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రహదారి పైకే మురుగునీరు

» ఆక్రమణే అసలు కారణం

ముసునూరు, జనవరి 10: డ్రైనేజీ వెళుతున్న స్థలం తనదని ఒక వ్యక్తి ఆక్రమించడంతో రహదారిపై మురుగునీరు నిల్వ ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు మండలంలోని సూరేపల్లి బీసీ కాలనీ వాసులు బట్టి శ్రీనివాసరావు, పొజ్జూరి చెన్నారావు, ఉలాస ఆదిశేషు వాపోయారు. నివాస గృహాల్లో వాడుక నీరు, మురుగునీరు సైతం వెళ్ళనీయకుండా రహదారిపై మట్టి పోశాడన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు స్పందనలో అర్జీ ఇచ్చామని, నేటికీ సమస్య పరిష్కరించలేదని ఆరోపించారు. రహదారిపై నిలిచిన మురుగునీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొందని, ఇప్పటికైన రహదారి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి, మురుగునీరు పారేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై సూరేపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించామని, డ్రైనేజీ ఆక్రమణను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైనేజీలోంచి పైపులైన్!



కలిదిండి, జనవరి 10 : మట్టగుంట దళితవాడలో డ్రైనేజీ నీరు రహదారి పైకి రావటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ తూము లోపల నుంచి పైపులైన్ వేయటంతో మురుగునీరు వెళ్లే అవకాశం లేక రహదారి పైకి వస్తోందని, పైపులైన్ గొట్టంలోకి మురుగునీరు కూడా వెళ్లే అవకాశం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ తూములో ఉన్న పైపులైన్ తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. దీనిపై సర్పంచ్ అంద్రాజు రత్నమణిని వివరణ కోరగా, దళితవాడకు వెళ్లే పైపులైన్ గొట్టం డ్రైనేజీలో ఉన్న తూము లోపల నుంచి వేయటం కాంట్రాక్టర్ తప్పిదమన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జూదం వద్దు..

సంప్రదాయ క్రీడలు ముద్దు : సీఐ



ముసునూరు, జనవరి 10: సంక్రాంతి పండుగ రోజుల్లో యువత జూదం వైపు మొగ్గుచూపకుండా గ్రామాల్లో సంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవాలని నూజివీడు సీఐ బాల సురేష్ అన్నారు. బుధవారం చెక్కపల్లిలో ఎస్ఐ ఎం.కుటుంబరావు ఆధ్వర్యంలో జూదంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కోడి పందేలు తదితర జూద క్రీడలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర ఆటల పోటీలను నిర్వహించుకోవాలని సీఐ అవగాహన కల్పించారు.

ఆగిరిపల్లి: కోడిపందేలు ఆడవద్దని, శారీరక దారుఢ్యాన్ని పెంచే ఆటలపై మక్కువ పెంచుకోవాలని, వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండాలని ఎస్సై చంటిబాబు విద్యార్థులకు సూచించారు. జూద క్రీడల జోలికి వెళితే కేసుల బారిన పడతారని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నూజివీడు: పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని నూజివీడు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో జూదం వల్ల యువత ఏ విధంగా తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోడికత్తుల తయారీ దారులు, నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని, చివరికి కోడిపందేల నిర్వహణకు స్థలాలను ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత సమాచారాన్ని 83329 59175కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జూదం అరికట్టండి : ఎస్ఐ వెంకట్ కుమార్

ముదినేపల్లి: హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సంక్రాంతి సందర్భంగా ముదినేపల్లి మండలంలో కోడిపందేలు, పేకాటలు, ఇతర జూదాల నిర్వహణను అడ్డుకోవాలని ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు, ఇతర సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా మండలంలో 18వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉందని, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకుండా నిఘా విధించాలని కోరారు. తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకారి..కోనోకార్పస్!

- » పుప్పొడితో శ్వాసకోశ .. జీవ మనుగడకు హాని
- » విచ్చలవిడి పెంపకంతో ప్రజల బెంబేలు
- » పూర్తిగా తొలగించాలంటూ అధికారులకు వినతి

కలిదిండి, జనవరి 10 : కోనోకార్పస్ మొక్కలు మానవ మనుగడకు, పర్యావరణానికి హాని కలిగిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నా జిల్లాలో అధికారులు వీటిని విచ్చలవిడిగా పెంచడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటారు కానీ అన్ని రకాల మొక్కలు కాదు. ఇందులో కొన్ని జీవ మనుగడకు హాని కలిగిస్తాయి. అలాంటి కోవకు చెందిన మొక్కలే కోనోకార్పస్. ఇదే విషయాన్ని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. ఆస్మా, అలర్జీ తదితర శ్వాస కోశ వ్యాధుల బారిన పడతారని తేలింది. ఈ మొక్కల పెంపకంపై తెలంగాణలో నిషేధం ఉంది. కానీ కలిదిండి మండలంలో పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి కిరువైపులా మూడు కిలోమీటర్ల మేర కోనోకార్పస్ మొక్కలను అధికారులు పెంచుతున్నారు. జడ్పీ హైస్కూళ్ల ఆవరణల్లో ఈ మొక్కలను పెంచుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రహదారుల పక్కన విచ్చలవిడిగా పెంచటంతో వీటి పువ్వుల నుంచి వెలువడే పుప్పొడి వల్ల శ్వాస కోశ వ్యాధులు కలుగుతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. వీటి వేర్లు వల్ల భూమిలో కేబుళ్లు, పైపులు ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. చూడడానికి అందంగా ఉండడం, ఏ ప్రదేశంలో అయినా సరే నేల స్వభావంతో సంబంధం లేకుండా ఈ మొక్కలు ఏపుగా పెరుగుతుండడం, పశు పక్ష్యాదులు వీటి జోలికి వెళ్లకపోవ డంతో అధికారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మొక్కల వల్ల హాని జరుగుతుందని గుర్తించి ఇటీవల బాస్కరావుపేట, పెదలంక జడ్పీ హైస్కూల్ పాఠశాల ఆవరణంలో కోనోకార్పస్ చెట్లను పూర్తిగా తొలగించారు. మిగిలినచోట్ల తొలగింపు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



భోగేశ్వరస్వామి ప్రధాన రహదారికిరువైపులా పెరిగిన మొక్కలు

హైస్కూల్‌లో తొలగించిన మొక్కలు